నత్తనడకన సీసీ రోడ్ల పనులు

బురాన్‌పల్లి గ్రామంలో పూర్తికాని సీసీ రోడ్డు పనులు

వికారాబాద్, మార్చి 5 : గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద వికారాబాద్ మండలానికి రూ. మూడు కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. మండల పరిధిలో 21 గ్రామ పంచాయతీలకు రూ.5లక్షల నుండి రూ.40లక్షల వరకు ప్రతి గ్రామ పంచాయతీకి నిధులు విడుదల అయ్యాయి. సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మార్చి 15వ తేదీ వరకు సీసీ రోడ్ల పనులు పూర్తి అయితే అందుకు సంబంధించిన బిల్లులు మార్చి 31వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆలస్యంగా పనులు చేసిన వారికి నిధులు రావడం ఆలస్యం అవుతుంది. గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు పూర్తి చేసేందుకు మండల స్థాయి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో జిల్లా అధికారుల ఆదేశాలు భేఖాతరు చేస్తూ సీసీ రోడ్ల పనులు నత్తనడకన సాగు తున్నాయి. వికారాబాద్ మండలం బురాన్‌పల్లి, సిద్దులూర్ తదితర గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను తీసుకొచ్చారు. కాని పనులు ప్రా రంభించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

ఉపాధి హామీ పనుల గురించి తెలుసుకుంటున్న ఎంపీడీవో నర్సిములు

ధారూరు, మార్చి 5: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ధారూరు ఎంపీడీవో నర్సింహులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామంలోని సాలె బాలమ్మకుంటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో పరిశీలించారు. జరు గుతున్న పనుల వివరాలను ఏపీవో సురేశ్, ఉపాధి హామీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో వెంట ఏపీవో, టీఏ, ఎఫ్‌ఏ ఉన్నారు.

పంచాయతీ కార్మికుల సేవలు మరువలేనివి..

పంచాయతీ కార్మికుడి జన్మదిన వేడుకలో పాల్గొన్న తహసీల్దార్ మురళీధర్

కులకచర్ల, మార్చి 5: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమని కులకచర్ల తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో పని చేస్తున్న కార్మికుడి జన్మదినాన్ని మంగళవారం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కోట బురుజు కూల్చివేత పరిశీలన

అయినాపూర్‌లో కోట బురుజు కూల్చివేతను పరిశీలిస్తున్న డీఎల్పీవో సంధ్యారాణి

దోమ, మార్చి 5: కోట బురుజు కూల్చివేత గ్రామ కంఠం భూమిలో ఇండ్ల నిర్మాణం చేస్తున్నారనే ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తున్నట్లు డీఎల్పీవో సంధ్యారాణి అన్నారు. దోమ మండల పరిధిలోని అయినాపూర్ గ్రామంలో కోట బురుజు కూల్చివేత గ్రామ కంఠం భూమిలో ఇండ్ల నిర్మాణంపై కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆమె మంగళవారం గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోట బురుజు కూల్చివేత, ఇండ్ల నిర్మాణంపై భూమికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, ఇంటికి సంబంధించిన ఎలాంటి పత్రాలు ఉన్నా కంప్లెట్‌దారులు, ప్లాట్లు కొన్నవారు, ఇండ్లు నిర్మించుకునే వారు సైతం గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని ఆమె సూచించారు. వారు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సోమలింగం, కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గోవర్దన్, మాజీ సర్పంచ్ మున్నయ్య పెద్దలు జనార్దన్‌గౌడ్, బాబయ్య, రాములు, రవిగౌడ్, సుబాన్, అంజిలయ్య పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



మత్స్య సహకారం సంఘం చైర్మన్, కార్యదర్శులకు నియామక పత్రాలను అందజేస్తున్న అధికారి శ్రీకాంత్‌రెడ్డి

దోమ, మార్చి 5 : అయినాపూర్ గ్రామంలో మత్స్య సహకార సంఘం ఎన్నిక నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు జూనియర్ సహాయక ఎన్నికల అధికారి శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని అయినాపూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో 13 మంది మత్స్య సహకార సంఘం సభ్యులతో పాటు గ్రామ సహకార సంఘం వారసులతో సమావేశం ఏర్పాటు చేసి నూతన కార్యవర్గం సభ్యులలో చైర్మన్‌గా బోయిని నర్సింహులు, కార్యదర్శిగా బుసని రాములును ఎన్నుకోగా, మిగతా వారిని డైరెక్టర్లుగా ఎన్నికైన ఎన్నికల అధికారి వారికి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం దోమ మండల బీసీ సంఘం అధ్యక్షుడు మేకల గోవర్దన్ ముదిరాజ్ చైర్మన్, కార్యదర్శులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ చైర్మన్ బోయిని చంద్రయ్య, మత్స్య సహకార సంఘం సభ్యులు, గ్రామ ముదిరాజ్ యువకులు పాల్గొన్నారు.

నగర రచయితకు ఫ్రాన్స్ అవార్డు

హైదరాబాద్, మార్చి 5(నమస్తే తెలంగాణ) : ఫ్రాన్స్‌కు చెందిన కమూరా ఇంటర్నేషనల్ డీ ఎస్క్రిటోర్స్ అండ్ యాంప్ ఆర్టిస్ట్స్ (సీఐఈఎస్ఏఆర్‌టీ)సంస్థ ఆధ్వర్యంలో ఫ్రాన్స్ జాతీయ చిహ్నమైన ఈఫిల్ టవర్‌పై నిర్వహించిన రచనల పోటీల్లో నగరానికి చెందిన అశోక్ చక్రవర్తికి ద్వితీయ బహుమతి లభించింది. జనవరి 11న ప్రపంచ వ్యాప్తంగా రచనలు ఆహ్వానించగా, అందులో 30 దేశాల నుంచి 140 మంది పాల్గొన్నారు. ఇందులో 18 మందిని ఎంపిక చేయగా, అందులో అశోక్ చక్రవర్తి రచించిన 'ఏ డిలైట్‌– ఫీల్డ్ షవర్' పేరుతో రచించిన పద్యం ద్వితీయ బహుమతికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఎంపికైన రచనలను ఫ్రాన్స్‌లో నిర్వహించే సాహిత్య ప్రదర్శనలో ప్రదర్శించడమే కాకుండా, విజేతలకు త్వరలోనే బహుమతులు ప్రదానం చేయనున్నారు. అలాగే, ఈ మేరకు ఆయనకు సర్టిఫికెట్‌ను కూడా పంపించారు. అంతర్జాతీయ రచనల పోటీల్లో తనకు అవార్డు దక్కడం సంతోషంగా ఉందని అశోక్ చక్రవర్తి పేర్కొన్నారు.

ఇంటర్నేషనల్ స్పేస్‌టెక్
స్టార్టప్ సపోర్టు-2024

సిటీబ్యూరో, మార్చి 5 (నమస్తే తెలంగాణ): అంతరిక్ష రంగానికి సంబంధించి స్టార్టప్ కార్యకలాపాలను నిర్వహిస్తున్న కంపెనీలను ప్రోత్సహించేందుకు టీ హబ్‌లో ఈనెల 14న ఇంటర్నేషనల్ స్పేస్‌టెక్ స్టార్టప్ సపోర్టు–2024 కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ రంగంలో మరిన్ని స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు వీలుగా టీహబ్ ఈ కార్యక్రమం చేపట్టిందని నిర్వాహకులు తెలిపారు. ఇండస్ట్రియల్ టెక్నాలజీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, తైవాన్ యాక్సిలరేటర్ ప్లస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు (https://bit.ly/ 4bS2B Fk) ఈ లింకులో సంప్రదించాలని తెలిపారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

- 13 అంశాలపై చర్చ
- శానిటేషన్, ప్రకటనలపై హౌస్ కమిటీ ప్రకటన

సిటీబ్యూరో, మార్చి 5(నమస్తే తెలంగాణ): మహా నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం (నేడు) స్టాండింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ నెల 2వ తేదీన బీఆర్‌ఎస్ నుంచి 8 మంది, ఎంఐఎం తరపున ఏడుగురు కార్పొరేటర్లను స్టాండింగ్ కమిటీ సభ్యులు కొత్తగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలోనే ముందుగానే ఈ కమిటీ తొలి సమావేశం ఏర్పాటు చేసుకుంది. ఈ మేరకు స్టాండింగ్ కమిటీలో 13 అంశాలను ఎజెండాగా చేర్చారు. శానిటేషన్, ప్రకటనల విభాగాలపై హౌస్ కమిటీని ప్రకటించడంతో పాటు అత్యధికంగా సీఎస్‌ఆర్ పద్ధతిలో చెరువుల సుందరీకరణ, గ్రీనరీ, జంక్షన్ల అభివృద్ధిపై చర్చించి సభ్యులు ఆమోదించనున్నారు.

శానిటేషన్, ప్రకటనలపై హౌస్ కమిటీ ఇదే..

పారిశుద్ధ్యం, అడ్వర్టయిజ్‌మెంట్ విభాగంలో అక్రమాలను నిగ్గు తేల్చేందుకు రెండు కమిటీలు వేశారు. ఒక్కో పార్టీ నుంచి ఇద్దరికి హౌస్ కమిటీలో స్థానం కల్పించారు. శానిటేషన్‌కు సంబంధించి చైర్ పర్సన్‌గా మేయర్ గద్వాల విజయలక్ష్మి, సభ్యులుగా బీఆర్‌ఎస్ నుంచి రావుల శేషగిరి, సామల హేమ, కాంగ్రెస్ తరపున ఎం.రజిత, వి.జగదీశ్వర్ గౌడ్, బీజేపీ నుంచి డాక్టర్ సురేఖ, శ్రవణ్, ఎంఐఎం సయ్యద్ సోహైల్ ఖాద్రి, డాక్టర్ ఆయేషా హుమేరలను నియమించారు. ఇక ప్రకటనల విభాగం సంబంధించి చైర్ పర్సన్‌గా మేయర్ గద్వాల విజయలక్ష్మి, సభ్యులుగా బీఆర్‌ఎస్ నుంచి సింధూ ఆదర్శ్‌రెడ్డి, మెట్టు శ్రవణ్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ నుంచి దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, పి.విజయారెడ్డి, బీజేపీ నుంచి వంగ మధుసూదన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి, ఎంఐఎం నుంచి సయ్యద్ మినహాజుద్దీన్, బి.జబీన్‌లను నియమించారు.

బాధిత కుటుంబాలకు బాసట

- సీవరేజీ పనుల్లో చనిపోయిన ముగ్గురి కుటుంబాలకు ఆర్థిక సహాయం
- ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున చేయూత

సిటీబ్యూరో, మార్చి 5(నమస్తే తెలంగాణ): జియాగూడ బైపాస్ రోడ్డులో సీవరేజీ నెట్ వర్క పైపులైన్ నిర్మాణ పనులు జరుపుతుండగా ప్రమాదవశాత్తు మృతి చెందిన ముగ్గురు కార్మికులు శ్రీనివాస్, హనుమంతు, వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం బాసటగా నిలిచింది. ఆర్థికంగా సాయం అందించి ఆదుకుంది. జాతీయ సఫాయి కర్మాచారి చైర్ పర్సన్ ఎం.వెంకటేశన్ మంగళవారం హైదరాబాద్‌కు విచ్చేసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారితో మాట్లాడారు. ఈ మేరకు ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున మూడు కుటుంబాలకు కలిపి మొత్తం రూ.30 లక్షలు విలువైన చెక్కుల్ని తక్షణ సాయంగా జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డితో కలిసి అందజేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ తక్షణ సాయం అందజేశారు. అంతకు ముందు చైర్ పర్సన్ ఎం.వెంకటేశన్, ఎండీ ఉన్నతాధికారులతో కలిసి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, సీజీఎం రఘు, మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

గడువులోగా బకాయిలు వసూలయ్యేనా?

- బకాయిలు రూ.41 కోట్లు.. వసూలైంది రూ.4 కోట్లు
- ఆస్తి పన్ను గడువు మరో 24 రోజులు

మియాపూర్, మార్చి 5 : చందానగర్ సర్కిల్ పరిధిలో ఆస్తి పన్ను మొండి బకాయిలు కోట్లలో పేరుకుపోయాయి. ఆర్థిక సంవత్సరపు పన్ను వసూళ్లలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యం వెరసి.. బకాయిల రూపంలోకి మారుతున్నాయి. వీటి వసూళ్లు ప్రతీ యేడు సిబ్బంది పెద్ద సవాల్‌గా మారుతున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరం మరో 24రోజులలో ముగియనున్న నేపథ్యంలో ప్రధానంగా కోట్లలో పేరుకున్న ఆస్తి పన్ను బకాయిల వసూళ్లకు సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. గడిచిన కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి చందానగర్ సర్కిల్ పరిధిలో పన్ను వసూళ్లు పేరుకుపోయి తాజాగా రూ.40 కోట్ల మేర ఉన్నాయి. ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంతో వీటిపై వడ్డీ అదనంగా మరో రూ.26 కోట్ల మేర తోడై మొత్తం రూ.60 కోట్లకు పైగా వసూళ్ల లక్ష్యంగా ఉన్నది. ఆర్థిక సంవత్సరం చివరిలో వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్)ను బల్దియా ప్రకటించింది. ఈ నెల 31 వరకు ఈ పథకం కింద చెల్లింపులకు గడువు. అయితే చందానగర్ సర్కిల్ పరిధిలో పేరుకున్న రూ.40 కోట్ల మేర బకాయిలపై వడ్డీ రూ.26 కోట్ల మేర ఉండగా.. ఓటీఎస్ కింద రూ.24 కోట్ల మేర మినహాయింపు లభిస్తుంది. ఏకకాలంలో బకాయిలు చెల్లించే వారికి 90 శాతం వడ్డీ రాయితీని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని బకాయిదారులకు చేరవేసి వాటిని రాబట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇందులో ఎంత మేర వసూలవుతాయన్నది సందేహం.

• చందానగర్ సర్కిల్ పరిధిలో రూ.12,442 బకాయిదారుల నుంచి రూ.38.26 కోట్ల మేర ఆస్తిపన్ను బకాయిలున్నాయి. ఓటీఎస్ కింద వీటిపై 90 శాతం వడ్డీ రాయితీ ఇస్తుండగా రూ.24 కోట్ల మేర మాఫీ వర్తించనున్నది. వడ్డీ మాఫీ కాగా రూ.41 కోట్లకు పైగా వసూళ్ల లక్ష్యం అధికారుల ముందుంది అయితే మార్చి 1 నుంచి 31 వరకు ఓటీఎస్ పథకం అమలు నేపథ్యంలో .. చందానగ్ సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 2,067 బకాయిదారుల నుంచి కేవలం రూ.3.96 కోట్ల మేర మాత్రమే బకాయిలు వసూళ్లయ్యాయి. గడువులోగా ఇంకా రూ.36 కోట్ల మేర వసూళ్లను చేరుకోవాల్సి ఉన్నది. ఉన్నతాధికారులు సైతం బకాయిల పురోగతిపై రోజువారీ సమీక్షిస్తుండటంతో.. సర్కిల్‌లో వాటిని ఎలాగైనా రాబట్టాలని సిబ్బంది తంటాలు పడుతున్నారు. ప్రధానంగా బకాయిలు వంద శాతం వసూలు చేయాలని అధికారులు చెబుతుండగా.. కొందరు సిబ్బందికి మాత్రం ఇదే కామధేనువుగా మారుతున్నది. ఉన్నతాధికారుల పేరు చెప్పి.. బకాయిదారులపై తీవ్ర వత్తిడులకు పాల్పడుతూ బకాయిల వసూలును గాలికి వదిలేసి తమ జేబులు నింపుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

నేడు బీఆర్‌ఎస్ ధర్నా

తాండూరు, మార్చి 4: కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌తో ప్రజలపై మోయలేని భారం వేయడాన్ని నిరసిస్తూ బుధవారం ఉదయం 10 గంటలకు తాండూరు పట్టణం అంబేద్కర్‌చౌక్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వ్యక్తికి జైలు శిక్ష

బషీరాబాద్, మార్చి 5 : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్సై రమేశ్ మంగళవారం తెలిపారు. ఇందర్‌చేడ్ గ్రామానికి చెందిన యాదప్ప మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ పోలీసులకు దొరికాడు. దీంతో పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అశోక్ ముందు హాజరుపర్చగా, జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు.

యువతి ఆత్మహత్య

బషీరాబాద్, మార్చి 5 : ఉరేసుకుని యువతి మృతి చెందిన సంఘటన కాశీంపూర్ గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ యువతి(17) 7వ తరగతి వరకు చదివి ఇంట్లోనే ఉంటుంది. అయితే మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. యువతి తండ్రి బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

వంద శాతం పల్స్ పోలియో

పెద్దేముల్, మార్చి 5 : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం వంద శాతం పూర్తి చేసినట్లు మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బుచ్చిబాబు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని మొత్తం 4,265 మంది చిన్నారులకు గాను అందరికీ పోలియో చుక్కలను వేసినట్లు తెలిపారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

కులకచర్ల, మార్చి5: ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు తెలిపారు. చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను రెవెన్యూ సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న దర ఖాస్తుల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లింగయ్య, వెంకటగిరి పాల్గొన్నారు.

మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

కొద్ది గంటల్లో ప్రీవెడ్డింగ్ షూట్ ఉందనగా బలవన్మరణం

శేరిలింగంపల్లి, మార్చి 5: మరికొద్ది గంటల్లో ప్రీ వెడ్డింగ్ షూట్ జరగాల్సి ఉంది. కాబోయే భర్త మాట్లాడి వెళ్లిన కొద్దిసేపటికే ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ భాను ప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఈవిధంగా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా గొసుకులపల్లికి చెందిన ముద్దం విద్యశ్రీ(23) కొత్తగూడలో శ్రీవెంకటరమణ పీజీ హాస్టల్‌లో నివాసం ఉంటూ ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది.

సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో హాస్టల్‌లోని బాత్‌రూమ్‌కు వెళ్లి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి రూమ్‌మేట్స్ డోర్ ఓపెన్ చేసి చూశారు. టవల్‌తో షవర్ రాడ్‌కు ఉరివేసుకోవడంతో అపస్మారక స్థితికి వెళ్లింది. వెంటనే సమీపంలో ఏని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ రాత్రి 11.30 గంటలకు మృతి చెందింది. ఇటీవల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో ఆమెకు పెళ్లి నిశ్చయమైంది. పెళ్లి కార్డులను పంపిణీ చేసి షాపింగ్ పూర్తి చేసింది. బుధవారం ప్రీ వెడ్డింగ్ షూ టింగ్ ఉందని పోలీసులు తెలిపారు. ఆమెకు కాబోయే భర్త హాస్టల్ వద్దకు వచ్చి మాట్లాడి వెళ్లిన తరువాత ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు పేర్కొన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎల్సీలు ఇవ్వాలని వినతి

సిటీబ్యూరో, మార్చి 5(నమస్తే తెలంగాణ): కొత్త విద్యుత్ లైన్లు వేసిన చోట గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు ఎల్సీ ఇవ్వకపోవడంతో పనులు పెండింగ్‌లో పడుతున్నాయని, తమ విజ్ఞప్తిని పరిశీలించి ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) ఇవ్వాలని విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఖైరతాబాద్‌లో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్‌పీడీసీఎల్) సీఎండీ చైర్మన్ ముషారఫ్ ఫరూఖీకి కాంట్రాక్టర్లు తమ సమస్యలను మంగళవారం వివరించారు. కాంట్రాక్టర్లు పనులు నిర్వహించిన చోట విద్యుత్ శాఖ నుంచి లైన్ క్లియరెన్స్ ఇవ్వకపోవడం వల్ల కొత్తగా విద్యుత్ వినియోగదారులకు సరఫరాను చేయలేని పరిస్థితి నెలకొందని, ఈ విషయాన్ని పరిశీలించి ఎల్సీలు ఇవ్వాలని కాంట్రాక్టర్లు కోరారు. సీఎండీని కలిసిన వారిలో విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

తాండూరు రూరల్, మార్చి 5 : తాండూరు మండలంలోని కరణ్‌కోట గ్రామంలో మంగళవారం ఈజీఎస్ పథకంలో భాగంగా రూ.30 లక్షల విలువైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామంలో ఓగిపూర్ అప్రెచ్ రోడ్డు, ఎస్సీ కాలనీతోపాటు వడ్డేర కాలనీలో రోడ్ల పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శరణుబసప్ప, ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్, బసప్ప ముదిరాజ్, మాజీ ఉపసర్పంచ్ మాణెప్ప ఉన్నారు.

ప్రాణం మీదకు తెచ్చిన.. ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం

ఫుట్‌బోర్డు పైనుంచి కింద పడిన మహిళకు తీవ్రగాయాలు

అల్లాపూర్, మార్చి 5: ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ ఓ మహిళ ప్రమాదవశాత్తు కిందపడింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. బోరబండ నివాసి వరలక్ష్మి మంగళవారం ఉదయం ఎర్రగడ్డలో పటాన్‌చెరు వెళ్తున్న 219 నంబర్ ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉన్నారు. కూర్చోడానికి సీటు లేదు.. కనీసం నిలబడడానికి కూడా చోటు లేకుండా ప్రయాణికులు ఉన్నారు. దీంతో ఆ మహిళ ఫుట్‌బోర్డు ప్రయాణం చేసింది. కూకట్‌పల్లి బస్టాప్‌లో ఆ మహిళ ప్రమాదవశాత్తు బస్సులో నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బస్టాపులో ఉన్న ప్రయాణికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు కాలు విరిగిందని తెలిపారు. మహిళలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వారి ప్రాణాల మీదకు తీసువచ్చిందంటూ అక్కడున్న ప్రజలు మండిపడ్డారు. ప్రయాణికులకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. బస్సుల సంఖ్య ఎక్కువగా లేకపోవడంతో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా ప్రభుత్వం బస్సులు సంఖ్యను పెంచాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

ట్రేడింగ్ పేరుతో సైబర్ చీటర్స్ మోసం

సిటీబ్యూరో, మార్చి 5 (నమస్తే తెలంగాణ): ఓ రిటైర్డు రైల్వే ఉద్యోగిని మూడేండ్లుగా సైబర్‌నేరగాళ్లు మోసం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఇదంతా మోసమని గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన ఓ రైల్వే రిటైర్డు ఉద్యోగికి 2021లో సైబర్‌నేరగాళ్లు వాట్సాప్‌లో తాము ట్రేడింగ్ చేస్తూ బంగారం, వెండి, వజ్రాల్లో పెట్టుబడులు పెడుతామంటూ పరిచయమయ్యారు. నెల వారీగా కొంత మొత్తంలో పెట్టుబడి పెడుతూ వెళ్తే భారీ లాభాలు ఇప్పిస్తామంటూ నమ్మించారు. నమ్మిన బాధితుడు వాళ్లు చెప్పినట్లే నెలకు కొంత మొత్తంలో వాయిదాల పద్ధతిలో చెల్లిస్తున్నాడు. ఇలా ఆయన ఒక వెబ్‌సైట్‌లో తన పెట్టుబడులు, వాటి లాభాలను స్క్రీన్‌పై చూస్తున్నాడు. భారీగా లాభాలు కన్పిస్తున్నాయి, దీంతో ఆయన సైబర్‌నేరగాళ్లు చెప్పే మాటలు వింటూ తన సేవింగ్స్, నెలవారీగా వచ్చే పెన్షన్ డబ్బులను ట్రేడింగ్‌లో మూడేండ్లుగా రూ. కోటి వరకు పెట్టుబడి పెట్టాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆరా తీశారు. వెబ్‌సైట్‌ను పరిశీలించగా ఇదంతా మోసమని గుర్తించి సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంచాయతీలను సందర్శించిన అధికారి

రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్పీవో

బషీరాబాద్, మార్చి 5 : మండల పరిధిలోని మైల్వార్, బషీరాబాద్ పంచాయతీలను డీఎల్పీవో శంకర్‌నాయక్ మంగళవారం సందర్శించారు. పంచాయతీలకు సంబంధించిన పలు రకాల రికార్డులను పరిశీలించారు. రికార్డులను సక్రమంగా, ఎప్పటికప్పుడూ నిర్వహించాలని పం చాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలను, పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు మైల్వార్ గ్రామానికి సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదును పరిశీలించారు. ఎంపీవో రమేశ్, మైల్వార్, బషీరాబాద్ పంచాయతీ కార్యదర్శులు నర్సింహగౌడ్ ఉన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి వేడుకలు

దుండిగల్,మార్చి5: శైవభక్తులు విశేషంగా జరుపుకొనే మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు సూరారంలోని శ్రీఉమామహేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. మహానగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి విరివిగే విచ్చేసే భక్తులకు ప్రత్యేక వసతులు కల్పించి స్వామివారికి మొక్కులు చెల్లించుకునేందుకు ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. మహాశివరాత్రి వేడుకల సందర్భంగా మేడ్చల్ జిల్లాలోనే కీర్తి ఘడించిన కీసర మల్లికార్జునస్వామి ఆలయం తర్వాత అంతటి స్థాయిలో భక్తులచే నీరాజనాలు అందుకుంటున్నారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి, సూరారం, శివాహిల్స్‌లో వెలసిన శ్రీఉమామహేశ్వర స్వామి వారు. బుధవారం(6వ తేదీ) నుంచి శివరాత్రి జాతర మహోత్సవం ప్రారంభమై ఆదివారంతో ముగియనుంది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962